


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 602 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 03 బుధవారం డిసెంబర్2025 పేజీలు : 4 వెల : అమూల్యం

## రెండో విడత భూ సమీకరణకు గ్రీన్ సిగ్నల్

-ఏడు గ్రామాల్లో 16,666 ఎకరాల సమీకరణకు ఉత్తర్వులు జారీ

-అమరావతి, తుళ్లూరు మండలాల పరిధిలో భూముల సేకరణ

-ప్రక్రియ వేగవంతం చేయాలని సీఆర్‌డీఏకు ప్రభుత్వ ఆదేశం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. రెండో విడత భూ సమీకరణకు (ల్యాండ్ పూలింగ్) రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఏడు గ్రామాల్లో భూములను సమీకరించేందుకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియను చేపట్టాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులను విడుదల చేశారు. రెండో విడతలో భాగంగా రాజధాని పరిధిలోని అమరావతి, తుళ్లూరు మండలాల్లో మొత్తం 16,666.57 ఎకరాల భూమిని సమీకరించనున్నారు. ఇందులో 16,562.52 ఎకరాలు పట్టా భూములు కాగా, 104.01 ఎకరాలు అసైన్డ్ భూములుగా ఉన్నాయి. ఈ సమీకరణ పూర్తయ్యాక, అదనంగా 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా అందుబాటులోకి వస్తుంది. దీంతో రాజధాని అభివృద్ధి పనుల కోసం మొత్తం 20,494 ఎకరాలు సిద్ధం కానున్నాయి.

**సమీకరించనున్న భూముల వివరాలు:**

అమరావతి మండలం (7,465 ఎకరాలు): వైకుంఠపురం, పెద్దమద్దూరు, ఏంద్రాయి, కర్లపూడి లేమల్లే గ్రామాల్లో భూములను సమీకరించనున్నారు.

తుళ్లూరు మండలం (9,097 ఎకరాలు): వడ్లమాను, హరిశ్చంద్రాపురం, పెద్దపరిమి గ్రామాల్లో భూ సమీకరణ చేపట్టనున్నారు.

భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేసి, తదుపరి చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే మొదటి విడతలో భూములను సమీకరించగా, ఇప్పుడు రెండో విడత కూడా పూర్తయితే అమరావతిలో మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన భూమి పెద్ద ఎత్తున అందుబాటులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## ధాన్యం రైతుల సమస్యలకు చెక్..

### అందుబాటులోకి 1967 హెల్ప్‌లైన్:

మంత్రి నాదెండ్ల

-ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్

-రైతుల కోసం 1967 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ప్రారంభం

-ఈ ఖరీఫ్ సీజన్‌లో 11.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

-రైతుల ఖాతాల్లోకి రూ. 2,830 కోట్లు జమ చేసినట్లు మంత్రి వెల్లడి




2

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విజయవాడ కానూరులోని పౌరసరఫరాల భవనంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌తో పాటు, '1967' టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు

## చంద్రబాబు నిర్వహిస్తోంది ప్రభుత్వమా? ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీనా?

- విజనరీ చంద్రబాబు పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తిరోగమనం

- తీవ్ర రెవెన్యూ లోటు లో రాష్ట్రం

- రైతులు, విద్యార్థులు సంక్షేమానికి కోత.. అటకెక్కిన పేదల వైద్యం..

కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 02 : విజనరీ చంద్రబాబు పరిపాలిస్తుంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్నా..? లేక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీనా..? అన్న అనుమానం కలుగుతోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి అనుమానం వ్యక్తం చేశారు. ఏడాదిన్నార పాలనలో భారీగా పెరుగుతున్న రెవెన్యూ లోటు పై ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి గతి తప్పిందని, దాన్ని గాడిలో పెట్టాలంటే సంపద సృష్టించాలని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు చేస్తున్నది ఏంటని ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు భారీగా పెరిగిందని కాగ్ నివేదికలో వెల్లడించిన విషయం వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 33,185కోట్లు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తే అది అక్టోబర్ నాటికే రూ. 47వేల కోట్లు దాటిందని పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి తన అయిదేళ్ల పరిపాలనలో రూ. 3.31 లక్షల కోట్లు అప్పులు చేస్తే, ప్రస్తుతం ఉన్నా కూటమి ప్రభుత్వం 18 నెలలకే రూ. 2.5 లక్షల కోట్లు అప్పు చేసారని తెలిపారు. రానున్న మూడున్నర ఏళ్లలో ఇంకెంత అప్పు చేస్తారో అని ప్రశ్నించారు. ఇలా అప్పులు



చేసుకుంటూపోతే చంద్రబాబు సంపద సృష్టి మాట నీట బుడగలేనా అని మండిపడ్డారు. చంద్రబాబు పరిపాలనలో జీఎస్టీ వసూళ్ళు, కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పన్నుల వసూళ్లు తగ్గాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కళ్లబొల్లి మాటలు చెప్పి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ను దివాళా తీయించేలా చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు పై నాగమణి మండిపడ్డారు.

## పవన్ చేతబడి మాంత్రికుడిలా మాట్లాడుతున్నారు: పేర్ని నాని


2

-కొబ్బరి చెట్లపై పవన్ వ్యాఖ్యలను తప్పుబట్టిన పేర్ని నాని

-శాస్త్రవేత్తలతో పరిశోధన చేయించాలని ప్రభుత్వానికి సూచన





# పార్లమెంటులో విపక్షం రచ్చ రాజకీయం !

మంగళవారం 2-12-2025

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఊహించినట్లుగానే వాయిదాలతో మొదలయ్యాయి గతానికి భిన్నాంగా సమావేశాలు ప్రారంభం కాలేదు. గతంలోనూ ఇలాగే వాయిదాల మీద వాయిదాలు పడుతూ..మధ్యమధ్యలో ప్రభుత్వం తనకు కావాల్సిన ఎజెండాను పూర్తి కానిచ్చుకుని, నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తోంది. ఇదే తంతు గత కొన్నేళ్లుగా చూస్తున్నాం. గొడవ చేయడం, తాము పట్టిన అంశంపైనే చర్చించాలని విపక్షం పట్టుబట్టడం..ప్రభుత్వం ససేమిరా అనడం..వాయిదా పడడం కూడా గత సమావేశాల్లో చూశాం. ఇప్పుడు కూడా అందుకు భిన్నంగా ఏమీ జరగడం లేదు. విపక్షాలు ఇదే పెద్ద విజయంగా భావిస్తున్నాయి. కోరుకున్న అంశంపై ఎలా చర్చించాలో తెలియని వారంతా పార్లమెంటులో ఎంపిలుగా ఉన్నారు. ఏ రూల్ కింద కోరితే చర్చకు వస్తుందో అందరికీ తెలుసు. కానీ రూల్ బ్రేక్ చేసి, పట్టుబట్టి చర్చించాలని కోరుకోవడం దుర్మార్గం. పార్లమెంటులో ప్రజల సమస్యలపై చర్చించడం ద్వారా ప్రతిపక్షం ప్రధాన బాధ్యతను తీసుకోవాలి. కానీ గత దశాబ్దకాలంగా అలాంటి సంప్రదాయం తుంగలో తొక్కారు. గొడవ చేయడం విపక్షం వంతయితే..వాయిదా వేయడం ప్రభుత్వం విధానంగా మారింది. ఈ క్రమంలో సోమవారం ప్రారంభమైప పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలిరోజే వాయిదాతో మొదలయ్యాయి. పార్లమెంటు కార్యకలాపాలను శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లకుండా మొండిగా వ్యవహరించడంలో ఇరుపక్షాలు తమవంతు పాత్రను సమర్థంగా నిర్వహించాయి. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పక్రియపై అత్యవసర చర్చ జరపాలని, ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం, దానిని తిరస్కరించడం ద్వారా విలువైన పార్లమెంట్ సమయం తొలిరోజు, మలిరోజు ఢిల్లీ కాలుష్యంలో కలిసి పోయాయి. సర్ ద్వారా నకిలీ, చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తే విపక్షాలకు అభ్యంతరం ఎందుకన్నది మొదట చర్చించాలి. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారు ఇక్కడ ఓటు ఎలా పొందారన్నది రెండో ప్రశ్న. ఈ రెండింటికీ విపక్షాల వద్ద సమాధానం లేదు. ఒక రాజ్యంగా సంస్థ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియను అడ్డుకోవడం రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే అవుతుంది. రాజ్యాంగ బుక్‌ను పట్టుకుని ఊరేగుతున్న రాహుల్, ఆయన అనుచరగణానికి ఇది కూడా తెలియకపోవడం మూర్ఖత్వంగానే చూడాలి. రాజ్యాంగ ప్రసాదించిన హక్కుల గురించి మాట్లాడుతున్న రాహుల్ పరివారం దీనిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలి. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని తక్కువ చేసి మాట్లాడడం, వారు చేసే ప్రక్రియలను అడ్డుకోవడం రాజ్యాంగ రక్షణ అవుతుందా అన్నది రాహుల్ చెప్పాలి. ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఎవరి ఓటయినా గల్లంతయితే నిలదీయా లి. ఇప్పటికే సుప్రీం గడప దొక్కిన రాహుల్ ఒక్క ఓటుపైనా అఫిడవిట్ దాఖలు చేసి ఆధారాలు చూపలేక పోయారు. బీహార్‌లో ఓటమి అన్నది రాహుల్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా తెలిసి చేస్తున్నవే తప్ప మరోటి కాదు. ఇందులో ప్రజలపై వారికి ఎలాంటి ప్రేమా లేదు. కేవలం అధికార దాహంతో చేస్తున్నవే. అలా కానట్లయితే పార్టమెంటులో చర్చకు నోటీస్ ఇచ్చి, తగిన సమయంలో చర్చించవచ్చు. కానీ అలా చేయడం లేదంటే..రచ్చ చేయడం వారి లక్ష్యంగా కనిపిస్తోంది. ఇటీవల చనిపోయిన వారి ఆధార్ నంబర్లు దాదాపు 2కోట్లను ఉడాయ్ రద్దు చేసింది. అంటే అది తప్పుచేసినట్లుగా భావించాలా? చనిపోయిన వారి ఓట్లు, ఊరుమారిన వారి ఓట్లు, అక్రమంగా దేశంలో ఓటర్లుగా నమోదైన విదేశీయుల ఓట్లను అలాగే ఉంచుమంటారా అన్నది రాహుల చెప్పాలి. నిజానికి అధికారంలోకి రావడమే లక్ష్యంగా రాహుల్ చేస్తున్న యాగీలో భాగమే ఈ ఓటు రచ్చ. ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను పక్కన పెట్టి తొలిరోజే పార్లమెంటరీ సాంప్రదాయాలను ప్రతిపక్షాలు తుంగలో తొక్కాయి. ఫలితంగా లోక్‌సభ వరుసగా రెండ్రోజులు

పూర్తిగా స్తంభించిపోయింది. రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఇది ఇలాగే కొనసాగుతుంది తప్ప కొత్తగా వీరినుంచి ఆశించడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే..ఎస్ఐఆర్‌పై పార్లమెంటు దద్దరిల్లింది. ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభలో వాయిదాల పర్వం నడిచింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసాం..అని చెప్పుకోవడానికి తప్ప మరోటి కాదు. అందుకే తొలిరోజే.. ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుపడుతూ ప్రతిపక్ష సభ్యులు సభా వేదిక వద్దకు దూసుకెళ్లారు. ఇలా వారు అధికారంలో ఉ న్నప్పుడు బిజెపి కూడా చేసిన తతంగమే. ఇది కూడా తమ పోరాటంగా వారు భావిస్తున్నారు. పార్లమెంటు ను స్తంభింప చేయడం అన్నది ఓ విజయంగా భావిస్తున్నారు. సర్‌పై ఎలాగూ ప్రభుత్వం వెంటనే చర్చకు అనుమతించదు. ఎందుకంటే వాయిదా తీర్మానం అన్నది కొంపలు మునిగే సమయంలో మాత్రమే అనుమతిస్తారు. అందుకే విపక్షాలు ఇచ్చిన తీరర్మానాన్ని స్పీకర్ ఓంబిర్లా తిరస్కరించడంతో వేదిక వద్దనే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎస్ఐఆర్ ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దంటూ నినదించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ అన్ని అంశాలపై చర్చకు సిద్ధమే నని స్పష్టం చేశారు. ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపింది. నినాదాలు, ఆందోళనలు చేయడానికి కాదని స్పష్టం చేశారు.. ఇలా రెండోరోజూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. గతంలో ఆదానీ విసయంలో కూడా ఇలాగే చేశారు. పార్లమెంట్‌ను స్తంభింప చేయడం విజయమనుకుంటే ప్రజలకు జవాబు చెప్పాలి. పార్లమెంట్ అన్నది ప్రజల సొత్తు. కవలం 20,30 మంది ఎంపిలది కాదని గుర్తించాలి. ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ అంశంపై అత్యవసర చర్చకు డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల డిమాండ్‌ను పరిశీలిస్తున్నామని, అత్యవసర చర్చ సాధ్యం కాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అయినా ఆందోళన చేస్తున్నారంటే రాజకీయం తప్ప మరోటి కాదు. ఇలాంటి విపక్షాల వల్లనే పార్లమెంటులో ఏ సమస్యా చర్చకు రావడం లేదు. ప్రభుత్వం కూడా ఇదే కోరుకుంటోంది. చర్చలు జరిగితే వారి వ్యవహారం కూడా బయట పడుతుంది. అయితే చర్చల కోసం సక్రమమైన పద్దతిలో విపక్షాలు వ్యూహాత్మకంగా వ్యవహరించనంత కాలం రచ్చ సాగుతూనే ఉంటుంది.

# గంజాయి డాన్ కామాక్షమ్మకు చెక్

### ఆమె ఐదు ఇళ్లను నేలమట్టం చేసిన జనం

నెల్లూరు,డిసెంబర్ 2

నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ్మ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిందని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తున్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు. నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో స్థానికులతోపాటు సీపీఎం నేతల ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. దాంతో కామాక్షమ్మతోపాటు అమె బంధువులు, అనుచరుల నివాసాలను స్థానికులు కూలగొట్టారు

# ఇమ్రాన్ పరిస్థితిపై ఆందోళన

### -రోడ్డుపైకి వచ్చిన పార్టీ కార్యకర్తలు

### -రావల్పిండిలో ఆందోళనలు..నిషేధాజ్ఞలు అమలు

లాహోర్,డిసెంబర్ 2 :

పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి చెందినట్లు వస్తోన్న వార్తల నేపథ్యంలో పాక్‌లో ప్రజాందోళన మిన్నంటింది. ఇమ్రాన్ ఖాన్‌ను ఎందుకు దాస్తున్నారంటూ ప్రజలు రోడ్డెక్కింది ఆందోళనకు దిగారు. దీంతో రావల్పిండిలో తీవ్ర ఉద్రిక్త పరిస్తితులు ఏర్పడ్డాయి. అయితే ఇమ్రాన్ మృతిని ఆ దేశ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే ఇమ్రాన్‌ఖాన్‌ను చూసేందుకు ఆయన కుటుంబసభ్యులను అనుమతించకపోవడం, అతని ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మంగళవారం మాజీ ప్రధానికి అనుకూలంగా భారీ ర్యాలీకి రంగం సిద్ధం చేశారు. ఆందోళనకారులను అడ్డుకొనేందుకు ప్రభుత్వం రావల్పిండిలో సెక్షన్ 144 విధించింది. ప్రజా భద్రత దృష్ట్యా బుధవారం వరకు అన్ని బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని గ్రూపులు రావల్పిండిలో శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ వెల్లడించింది. ఈ పరిణామాల వేళ ఇమ్రాన్‌ఖాన్ కుమారులు ఖాసీం, సులేమాన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ తండ్రి విషయంలో ఏదో జరగకూడనిది జరిగినట్లు అనుమానం వ్యక్తంచేశారు. ఆయన సురక్షితంగా ఉన్నారా, లేదా? ఆరోగ్యంగా ఉన్నారా, మరణించారా అనే విషయాలు వెల్లడించకుండా జైలు అధికారులు తమను మానసికంగా హింసిస్తున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. తమ తండ్రిని చూసేందుకు అనుమతించట్లేదన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై తమకు ఎలాంటి సమాచారం అందట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెలన్నర రోజుల నుంచి ఆయనను ఎవరూ కలవకుండా 'డెత్ సెల్'లో ఒంటరిగా నిర్బంధించినట్లు వస్తున్న వార్తలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆయన మృతి చెందినట్లు సోషల్‌మీడియాలో ఒక్కసారిగా వదంతులు తెర పైకి వచ్చాయి. బలూచిస్థాన్ రెబల్స్‌కు చెందిన 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించిన పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని రాసుకొచ్చింది. అలాగే పలు మీడియా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్లు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ సోదరీమణులు ఇటీవల జైలు వద్దకువెళ్లి ఆయనను కలిసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అందుకు అనుమతించకుండా.. తమపై విచక్షణారహితంగా దాడి చేశారని వారు వాపోయారు. దీంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.

# 50 రోజుల్లో 2వేల మంత్రాల పఠనం

### -కాశీ కుర్రాడు వేదమూర్తికి మోడీ ప్రశంసలు

న్యూఢిల్లీ,డిసెంబర్ 2

19 ఏళ్ల పండితుడు వేదమూర్తి దేవావ్రత్ మహేశ్ రేఖీపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. దండక్రామ పారాయాణాన్ని పూర్తి చేసిన క్రమంలో ఆ కుర్రాడిని ప్రధాని మెచ్చుకున్నారు. శుక్ల యజుర్వేదంలోని మధ్యాంధినిలో ఉన్న సుమారు 2000 మంత్రాలను ఆ యువకుడు పారాయణం చేశారు. వరుసగా 50 రోజుల్లో ఆ మంత్రాలను అతను వల్లించాడు. ఇదో గొప్ప ఘనత అని ప్రధాని మోదీ తన ప్రశంసలో పేర్కొన్నారు. రాబోయే తరాలు ఈ అద్భుత ఘనతను గుర్తుంచుకుంటాయని అన్నారు. భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఆ కుర్రాడు సాధించిన ఘనతను గర్విస్తారన్నారు. ఎటువంటి అవరోధాలు లేకుండా శుక్ల యుజుర్వేదంలోని 2 వేల మంత్రాలను ఆ యువకుడు పఠించినట్లు చెప్పారు. కాశీ నియోజకవర్గానికి చెందిన ఆ కుర్రాడు ఆ పవిత్ర పట్టణంలో అసాధారణ ఫీట్‌ను సాధించడం పట్ల సంతోషంగా ఉందని ప్రధాని అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో మోదీ మెసేజ్ చేశారు. ఆ కుర్రాడికి సపోర్టు ఇచ్చిన కుటుంబసభ్యులకు, పండితులుకు, సంస్థలకు ప్రధాని థ్యాంక్స్ తెలిపారు. మరో వైపు హర్యానాలోని జాజర్‌లో ఉన్న సిద్ధ బాబా పాల్‌నాథ్ ఆశ్రమాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. ప్రాణ ప్రతిష్ట, ఆత్మ భండార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సనాతన సంస్కృతి, మానవ పరిణామ క్రమంలో దాని ప్రభావాన్ని ఆయన తన ప్రసంగంలో తెలిపారు.

# మూగ బాలుడిపై వీధికుక్కల దాడి

### -తీవ్ర గాయాలతో నీలోఫర్‌కు తరలింపు

హైదరాబాద్,డిసెంబర్ 2:

హైదరాబాద్‌లోని హయత్‌నగర్ శివగంగ కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఏడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. సుమారు 10 నుంచి 20 కుక్కలు ఎగబడటంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శునకాల దాడిలో అతని చెవి ఊడిపోవడంతోపాటు తల, నడుము, వీపు భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు, చంద్రకళ దంపతులు గత మూడేండ్లుగా శివగంగ కాలనీలో కిరాయికి ఉంటున్నారు. వారి కుమారుడు ప్రేమ్‌చంద్ పుట్టుకతో మూగవాడు. మంగళవారం ఉదయం తండ్రి మేస్త్రీ పనికి వెళ్లగా, తల్లి ఇంట్లో నీళ్లు పడుతున్నది. ఈ క్రమంలో ఇంటి బయట ఆడుకుంటున్న ప్రేమ్‌చంద్‌పై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు వాటిని తరిమేసి బాలుడిని రక్షించారు. అనంతరం అతడిని నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి నిలోఫర్‌కు పంపడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నారు. కాగా, నగరంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేస్తున్నాయని, జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కామ్రేడ్ పెంచలయ్య హత్యకు నిరసనగా జిల్లా బంద్ సందర్భంగా రాస్తారోకో

కావలి,

కామ్రేడ్ పెంచలయ్య హత్యకు నిరసనగా వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు ఇచ్చిన నెల్లూరుజిల్లా బంద్ పిలుపులో భాగంగా మంగళవారం కావలిలో ఏరియా ఆసుపత్రి వద్ద నుండి వామపక్ష పార్టీలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనగా బయలుదేరి కోర్టుదగ్గర నుండి తిరిగి ఆర్టిసిబస్టాండు సెంటర్ కు ప్రదర్శన గాచేరుకొని అక్కడ రాస్తారోకో నిర్వహించడం జరిగింది.దీనివలన వాహనాలు భారీగా ఆగిపోవడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు పసుపులేటి పెంచలయ్య,సిపిఐ నాయకులు కోపర్తి నాగరాజు,సిపిఐ ఎంఎల్ నాయకులుఎల్. లక్ష్మారెడ్డి, ఎం ఆర్ పి ఎస్ నాయకులు జి వెంకటేశ్వర్లు, యు డి ఎస్ యు మాజీ నాయకులు కే భాస్కర్, మాట్లాడుతూ నెల్లూరు నగరంలో ఆర్డిటి కాలనీలో నివాసం ఉంటున్న సిపిఎం కార్యకర్త ప్రజా కళాకారుడు కామ్రేడ్ పెంచలయ్యను గంజాయి మూకలు హత్య చేయడాన్ని ఈ సందర్భంగా తీవ్రంగా ఖండిస్తు ఆయనకు జోహార్లు అర్పిస్తున్నామని అన్నారు. పెంచలయ్య నివాసం ఉంటున్న కాలనీలో గంజాయి డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాలు ను అమ్మకుండా ఆ కాలనీలో యువతని ప్రజలను చైతన్య పరుస్తూ మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేయడంతో గంజాయి మూకలు పథకం ప్రకారం హత్య చేశారని ఇలాంటి మూకలనుకఠినంగా శిక్షించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో లేనప్పుడు గంజాయి డ్రగ్స్ మాదకద్రవ్యాలు ఈ రాష్ట్రంలో లేకుండా చేస్తామని చెప్పిందని అధికారంలోకి వచ్చిన తరువాత చూసి చూడనట్లుగా ఉన్నదని దీనివలన గంజాయి అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలని గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ గంజాయి అంతిమించే వరకు గతంలో జరిగిన సారా పోరాటం లాగా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ వెంకయ్య.పి తిరుపాలు,వై. కృష్ణమోహన్, బి కృష్ణయ్య,జై మధుసూదన్ రావు, సిపిఐ నాయకులు పి.బోస్ ,డి దర్గా బాబు,ఎమ్మార్పీఎస్ నాయకులు చేవూరికిరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.వినీల్, ఎస్.కె అహ్మద్,డివైఎఫ్ఐ నాయకులుకే.చెన్నయ్య,మహిళా సంఘం నాయకులుఎం.శైలజ ఎస్ కె షబీర షామీమా తోపాటు వామపక్ష ప్రజా సంఘాలలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



సింహగర్జన
www.simhagarjana.com



# ఘనంగా కామ్రేడ్ భూపతిరాజు సుబ్బరాజు వర్ధంతి



తణుకు, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 02 : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ భూపతిరాజు సుబ్బరాజు అని శాసనమండలి సభ్యుడు వంకా రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల పార్కులోని ఆయన విగ్రహం వద్ద జరిగిన పద్దెనిమిదవ వర్ధంతి సమావేశానికి తొలుత రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు కోట రామ ప్రసాద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యుడు వంకా రవీంద్రనాథ్, డి.వి.వి.ఎస్.వర్మ, కామ్రేడ్ భూపతిరాజు సుబ్బరాజు కుమారుడు డా.బి.రమేష్ చంద్ర బాబు, కుమార్తె ఝాన్సి లక్ష్మి ఆయన విగ్రహానికి పుష్పమాలలతోనూ, పలువురు వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సమావేశంలో దారి దీపం సంపాదకుడు డి.వి.వి.ఎస్.వర్మ మాట్లాడుతూ కామ్రేడ్ భూపతిరాజు సుబ్బరాజు నిబద్ధత కలిగిన కమ్యూనిస్ట్ నాయకులని చెప్పారు. వారు కామ్రేడ్ వంక సత్యనారాయణ సమకాలికులని పేర్కొన్నారు. వారిరువురూ 1943వ సంవత్సరంలో ఒక సంవత్సరం రోజులు జైలు జీవితం గడిపారని తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంకు మనోరమ మాట్లాడుతూ కామ్రేడ్ భూపతిరాజు సుబ్బరాజు అనేకమందిని కమ్యూనిస్ట్ ఉద్యమం వైపు నడిపించిన స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ప్రముఖ వైద్యులు డా.వత్సవాయి వెంకటరాజు కామ్రేడ్ భూపతిరాజు సుబ్బరాజు కమ్యూనిస్ట్ పార్టీకి వారు చేసిన సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ బెల్లంకొండ బుచ్చిబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, సి.పి.ఐ. నాయకులు బొద్దాని నాగరాజు, డా.దాట్ల సత్యనారాయణ రాజు, వాకర్స్ క్లబ్ నాయకులు కోడూరి ఆంజనేయులు, రాష్ట్ర సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి మురళీ కుమార్, తణుకు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, తెలుగు దేశం నాయకులు తాతపూడి మారుతీరావు, ప్రముఖ న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కోశాధికారి అర్జి భాస్కరరావు, మానవత నాయకులు ఆలపాటి సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ కంభంపాటి కాశీపతి, మెడికల్ రెప్రజెంటేటివ్ వి.యన్.శివకుమార్, రిటైర్డ్ లెక్చరర్ వి.గోపాలకృష్ణారెడ్డి, అల్లూరి సూర్యనారాయణరాజు, పులపర్తి సత్యనారాయణ, విడివాడ భాస్కరరావు, కమ్యూనిస్ట్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) కుటుంబం

జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 02 : తిరుమల శ్రీవారిని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, కోటనందూరు మండలం యూత్ కమిటీల పరిశీలకులు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. వీఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ టీటీడీ బోర్డు చైర్మన్ బి.ఆర్.నాయుడు ఆధ్వర్యంలో ప్రియతమ నాయకుడు, జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ బోర్డు సభ్యులుగా తిరుమలలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారని, ముఖ్యంగా వైకుంఠం నుండి భక్తులకు దర్శనం కల్పించడం, నాణ్యమైన నిత్యవసర వస్తువులతో అన్నదానం, ప్రసాదం తయారీ వంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఆ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు జగ్గంపేట నియోజకవర్గ ప్రజలందరి పైన ఉండాలని కోరుకున్నానని అన్నారు

# కారుణ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 02 : తీవ్ర శీతాకాలంలో ఆర్థికంగా బలహీన స్థితిలో ఉన్న వృద్ధులు, నిరాశ్రయులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చూడాలనే లక్ష్యంతో కారుణ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వింటర్ రిలీఫ్ సర్వీస్ డ్రైవ్ లో భాగంగా దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. విజయ్‌రాజ్ జీ స్వయంగా హాజరై వృద్ధులకు కంబళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. పెరుగుతున్న చలికాలం నేపథ్యంలో ఆర్థికంగా వెనుకబడిన వృద్ధుల ఆరోగ్యం, భద్రత కోసం అవసరమైన వెచ్చదనం కల్పించడమే ఈ సేవా కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంలో డా. విజయ్‌రాజ్ మాట్లాడుతూ చలికాలంలో రోడ్లపై నివసించే వృద్ధులు వణికిపోతూ కనిపించడం ఎంతో బాధాకరమన్నారు. మన సమాజంలో ఒక్కరు కూడా చలిలో వణుకకూడదనే సంకల్పంతో ప్రతీ ఏటా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని స్లమ్ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసరాలు, వృద్ధాశ్రమలు, తక్కువ ఆదాయ వర్గాల కాలనీలలో నివసించే వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయబడింది. కంబళ్ళు అందుకున్న వృద్ధుల ముఖాల్లో కనిపించిన ఆనందం, ఉపశమనం అందరినీ స్పృహపరిచేలా నిలిచింది. కారుణ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ గత ఎన్నో సంవత్సరాలుగా పేదలు, నిరాశ్రయులు, అనాథ పిల్లలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని ఆహార పంపిణీ, దుస్తుల పంపిణీ, అత్యవసర సహాయం, వైద్య శిబిరాలు, నైపుణ్యాభివృద్ధి, స్కాలర్‌షిప్‌లు, పర్యావరణ అవగాహన, బాలశ్రమ నిర్మూలన, మానవ అక్రమ రవాణా నివారణ, మహిళా సాధికారత వంటి అనేక సేవా కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తూ వస్తుంది. ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, సమాజంలోని ప్రతి అవసరమైన వ్యక్తికి చేరువయ్యే విధంగా రాబోయే రోజుల్లో కూడా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తాం. ఇందుకు సహకరిస్తున్న దయార్ద్ర హృదయాలకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.



# తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ గా మట్టా గణేష్

## - అభినందించిన మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ



పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 02 :
పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ ప్రియ శిష్యుడైన నమ్మిన బంటు అయిన మట్టా గణేష్ కి తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రెసిడెంటుగా పదవి నియమించడంతో గణేష్ కి మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తమ గురువుగారు, నిజాయితీపరుడైన నిప్పులాంటి మనిషి, ముక్కుసూటి నాయకుడైన మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మకి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

మంగళవారం ఆయన కంట్రోల్ రూమ్ పనితీరును పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1,77,934 మంది రైతుల నుంచి కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు 11.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని వెల్లడించారు. ఇందుకుగాను రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 2,830 కోట్లు జమ చేసినట్లు వివరించారు. ధాన్యం విక్రయ ప్రక్రియలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసేందుకే ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చామన్నారు.రైతులు ధాన్యం రిజిస్ట్రేషన్, టోకెన్ల జారీలో జాప్యం, తూకంలో సమస్యలు, రవాణా, గోనె సంచుల కొరత వంటి ఏ సమస్య ఉన్నా 1967 నంబర్‌కు కాల్ చేయవచ్చని మంత్రి సూచించారు. ఈ హెల్ప్‌లైన్ సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. ఫిర్యాదు చేసే సమయంలో రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, టోకెన్ నంబర్, గ్రామ వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, పరిష్కారం అయ్యేవరకు అధికారులు ఫాలోఅప్ చేస్తారని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ఆర్. గోవిందరావు, అడ్మిన్ మేనేజర్ జి. శిరీష, ఇతర అధికారులు పాల్గొన్నారు?

# కడప హారిత ట్రావెల్స్ బస్సు కర్ణాటకలో బోల్తా

ఓ మహిళ మృతి, 10మందికి పైగా గాయాలు బెంగళూరు వెళ్తుండగా ఆంధ్ర- కర్ణాటక బార్డర్‌లోని మంచినీళ్ల కోట వద్ద డివైడర్‌ను ఢీకొట్టి లోయలో పడ్డ బస్సుమృతిచెందిన మహిళ ప్రొద్దుటూరుకు చెందిన అనిత (58)గా గుర్తింపు పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వివిధ ఆస్పత్రులకు తరలింపుగాయపడ్డవారు కడప, రాయచోటి, బెంగళూరుకు చెందినవారు ఉన్నట్లు సమాచారంతీవ్రంగా గాయపడ్డ పలువురిలో నలుగురిని మదనపల్లె జిల్లా అస్పత్రికి తరలింపు

# పవన్ చేతబడి మాంత్రికుడిలా మాట్లాడుతున్నారు:

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓ చేతబడి మాంత్రికుడిలా మాట్లాడుతున్నారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి 'కళ్ల దిష్టి' తగలడమే కారణమని పవన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మంగళవారం ఘాటుగా స్పందించారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి మూఢనమ్మకాలను ప్రచారం చేయడం దారుణమని, ఆయన హోదా ఏమిటో స్పష్టం చేయాలని సవాల్ విసిరారు.

"పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా మాట్లాడారా, లేక చేతబడి మాంత్రికుడి హోదాలో మాట్లాడారా? అసలు దిష్టి తగలడం అంటే ఏమిటి? రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ ఏర్పడటమే దిష్టి తగలడమా? పవన్‌కు చేతబడి విద్యలు కూడా తెలుసేమో" అంటూ పేర్ని నాని ఎద్దేవా చేశారు. టెక్నాలజీ ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా దిష్టి, మంత్రాలు, చేతబడులు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే శాస్త్రవేత్తలతో ఒక కమిటీ వేసి, కొబ్బరి చెట్లకు సోకిన వ్యాధిని గుర్తించి, వాటిని బతికించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు.

పరిపాలనపై దృష్టి సారించకుండా పవన్ కల్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని నాని విమర్శించారు. తెలంగాణలో రైతులు ఏపీతో పోటీపడి వరి, ఉద్యానవన పంటలు పండిస్తుంటే, ఇక్కడ మాత్రం పాలకులు ఇలా మాంత్రిక ప్రసంగాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కేవలం తమపై ఉన్న కేసులను మాఫీ చేసుకోవడానికి, దోచుకోవడానికే అధికారంలోకి వచ్చారని ఆరోపించారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ వ్యక్తిగత ఇమేజ్‌ను కూడా నాని టార్గెట్ చేశారు. "పవన్ కల్యాణ్ సినిమాలకు మ్యాట్నీ షోలకు కూడా జనం వెళ్లడం లేదు. ఆయనను నమ్మి సినిమాలు తీసిన నిర్మాతలు రోడ్డున పడ్డారు. ఇప్పటికీ ఆ సినిమాలకు సంబంధించిన జీఎస్టీ కూడా కట్టలేదు" అని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన దుర్మార్గపు ప్రచారాలను ప్రజలు నమ్మారని, అయితే ఇప్పుడు వారి మోసాన్ని గ్రహించారని, తగిన సమయంలో కచ్చితంగా గుణపాఠం చెబుతారని పేర్ని నాని హెచ్చరించారు. మొత్తంగా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ఆయన అపరిపక్వతకు, పరిపాలనపై అవగాహన లేమికి నిదర్శనమని నాని అభిప్రాయపడ్డారు.

ఆ విషయంలో చంద్రబాబు దిట్ట!

అదే సమయంలో పేర్ని నాని ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలో తప్పుడు, దిగజారుడు రాజకీయాలు చేయడంలో చంద్రబాబు దిట్ట అని, ఎప్పటికప్పుడు వింత పోకడలతో ముందుకెళతారని మండిపడ్డారు.

గతంలో ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లేవారని, కానీ ఇప్పుడు చంద్రబాబు డబ్బులిచ్చి పదవులు కొనుక్కునే కొత్త సంప్రదాయానికి తెరలేపారని ఆరోపించారు. ముందుగానే బేరం కుదుర్చుకుని, అడ్వాన్సులు ఇచ్చి రాజీనామాలు చేయించి, ఆ తర్వాత వారికి పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్టీఆర్ హయాం నుంచే చంద్రబాబుకు కుట్ర రాజకీయాలు అలవాటని, ప్రజాస్వామ్యం, విలువలను ఆయన పట్టించుకోరని దుయ్యబట్టారు.

ఇక, చంద్రబాబు తనపై ఉన్న కేసుల విషయంలో అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పేర్ని నాని ఆరోపించారు. వైద్యం చేయించుకోకపోతే చనిపోతానంటూ బెయిల్ తెచ్చుకుని ఇప్పటికీ ఆసుపత్రికి వెళ్లలేదని, అధికారులను బెదిరించి కేసులు మాఫీ చేయించుకుంటున్నారని విమర్శించారు.

అంతేకాకుండా, అమరావతిని చంపేసింది చంద్రబాబేనని, ఈ కుట్ర వెనుక ఉన్నది ఆయనేనని రాజధాని రైతులే అంటున్నారని పేర్కొన్నారు. పరిశ్రమలన్నీ వైజాగ్‌కు తరలిపోతుంటే అమరావతిలో భూముల ధరలు ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చింది కేవలం దోచుకోవడానికేనని, దోచిన సొమ్మును దుబాయ్‌లో దాచుకుంటున్నారని ఆరోపించారు. దొంగ సర్టిఫికెట్ తెచ్చుకున్నంత మాత్రాన చంద్రబాబు పునీతుడు కాలేరని, కచ్చితంగా ఆయనపై ప్రకృతి తిరగబడుతుందని, అప్పుడు ఇదే కోర్టులు ఆయన్ను జైలుకు పంపుతాయని పేర్ని నాని స్పష్టం చేశారు.

# తిరుపతి జిల్లా స్థాయి సమీక్షా సమావేశామం



, తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు జిలా కలెక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం.జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఇంచార్జి మినిస్టర్ మరియూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి నియోజకవర్గంలోని సమస్యలు, అభివృద్ధి పనులుపై సమావేశంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ తో చర్చించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

## సెలబ్రిటీలు మరణిస్తే ఇంత దిగజారుడా

**ఇదేం జర్నలిజం అంటూ వాపోయిన జాన్వీ**



సెలబ్రిటీలు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తోన్న తీరుపై నటి జాన్వీకపూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లి శ్రీదేవి మరణించినప్పుడు అందరూ తనను టార్గెట్ చేశారని బాధ పడ్డారు. కొందరు తన మాటలను మీమ్స్‌గా కూడా ఉపయోగించుకున్నారని అవి చూసినప్పుడు కలిగిన బాధ మాటల్లో వర్ణించలేనని అన్నారు. తాజాగా లెజెండరీ నటుడు ధర్మేంద్ర మృతి చెందినప్పుడు కూడా మీడియా అత్యుత్సాహం చూపించిందని అది నిజమైన జర్నలిజం కాదని జాన్వీ అసహనం వ్యక్తంచేశారు.తన తల్లి మరణించినప్పుడు టీవీ చూడడానికి కూడా భయం వేసిందని జాన్వీ అన్నారు. అమ్మ మరణంపై ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురుగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనేనని భయపడ్డా. ఆ తర్వాత అన్నీ అర్థం చేసుకొని నా పనిపై దృష్టిపెట్టాను అని జాన్వీ చెప్పారు. తాను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా తొలి చిత్రం ప్రచారంలో నేను మా అమ్మను గుర్తుచేసుకుంటూ చెప్పిన మాటలపై కొందరు మీమ్స్ చేశారు. నన్ను టా÷-గ్గ్÷ట్ చేసి మాట్లాడేవారు. అవి చూసి కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉన్నాను. ఆ కాలాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో నేను ఏది చెప్పినా అది అందరికీ తప్పుగానే అనిపించేది. తల్లి మరణంపై కుమార్తె బాధ పడితే దాన్ని కూడా అపహాస్యం చేస్తారని ఎవరైనా ఊహించగలరా. ధర్మేంద్ర విషయంలో కొందరు మరింత దిగజారి ప్రవర్తించారు. సెలబ్రిటీల విషయంలో ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు.. వ్యూస్, లైక్స్ కోసం ఇష్టం వచ్చింది రాస్తున్నారు. ఇలాంటి ధోరణిని ప్రోత్సహించకూడదని జాన్వీ అన్నారు.

## హిందీలో అడుగు పెట్టాలంటే ఆర్భాటం తప్పనిసరి

**-మళయాల నటుడు దుల్కర్ సల్మాన్**



హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. హిందీలో ప్రవేశించాలంటే హంగూ..ఆర్భాటంఅవసరం అన్నారు. లేదంటే మనలను కనీసం చూడకూడా చూడరని వ్యాఖ్యానించారు. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న దుల్కర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. హిందీ సినిమాలో నటించేటప్పుడు పెద్ద స్టార్ అని అనిపించుకోకపోతే వాళ్లు ఎంతో నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. తాను బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చింది. లేకపోతే నాకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఉండదు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. మన చుట్టూ జనాలు ఉంటేనే వాళ్లు మనల్ని గుర్తిస్తారు. లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్ అనుకుంటారు. అలాంటి భావన దురదృష్టకరం. మలయాళ సినిమా సెట్‌లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కువ ఖర్చు ఉండదు. లగ్జరీకి ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. ఇంటినుంచి అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం అని దుల్కర్ అన్నారు. 2018లో దుల్కర్ కార్వాన్ చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇటీవలే 'కాంత'తో ప్రేక్షకులను పలకరించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి.







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com